సంయుక్త సర్వే.. స్థానికుల ఆందోళన


ఇంటి కొలతలు తీసుకుంటున్న అధికారులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ : ఖానాపూర్ చెరువు పరిధిలోకి వచ్చే నివాస గృహాలపై రెండోరోజు శుక్రవారం బల్దియా, నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ఖానాపూర్ కాలనీలో చెరువు పూర్తి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే నిర్మాణాల వివరాలను సేకరించారు. సర్వే అధికారులు మాట్లాడుతూ ఖానాపూర్ చెరువు 114 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. మురుగుతో చెరువు కలుషితం కాకుండా మురుగు శుద్ధి కేంద్రం మంజూరైందని పేర్కొన్నారు. తిర్పెల్లి, బ్రాహ్మణవాడలో సైతం ఎఫ్‌టీఎల్ పరిధి ఉందన్నారు. దాదాపు 500 వరకు నిర్మాణాలు ఉండే అవకాశముందన్నారు. సర్వే పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. నీటి పారుదల శాఖ డీఈ ప్రేమ్‌సింగ్, ఆర్ఐ యజువేందర్‌రెడ్డి, టీఎంసీ భాగ్యలక్ష్మి తదితరులున్నారు.


ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కూల్చేస్తామంటే ఊరుకోం

అధికారులు సర్వే చేస్తుండటంతో ఖానాపూర్ కాలనీవాసులు వీధుల్లోకి వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 40 ఏళ్ల నుంచి ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని బతుకుతున్నామని, కూలీ నాలీ చేసుకుంటేనే పూట గడుస్తుందని వాపోయారు. ఇక్కడి నుంచి ఖాళీ చేయిస్తే మా బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నివాసాలు చెరువు పరిధిలోకి వస్తే కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు బల్దియా అనుమతులు ఎందుకు జారీ చేసిందని ప్రశ్నించారు.

20 కి.మీ. దూరం విస్తరించేలా!

● పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి పంచాయతీలు
● ప్రతిపాదనలకు తుది మెరుగులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్ :


సంస్థ పరిధిలోకి చేర్చే గ్రామాల భౌగోళిక చిత్రపటాన్ని అంతర్జాలంలో పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి డీటీసీపీఓ సుమలత, డీఎల్‌పీఓ ఫణిందర్‌రావు

పల్లె ప్రాంతాల్లో సౌకర్యాలు సమకూరేలా, మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దేలా తెరపైకి వచ్చిన పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు ప్రక్రియ జోరందుకుంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీతోపాటు చుట్టుపక్కల పంచాయతీలను కలిపి ఏర్పాటు చేసే ఈ సంస్థను దాదాపు 20 కిలోమీటర్ల వరకు విస్తరించేలా అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఆ పరిధిలోకి వచ్చే గ్రామాలు, జనాభా, ఇతర వివరాలను సేకరిస్తున్నారు. హద్దులు గుర్తించేందుకు డీటీసీపీఓ, జిల్లా పంచాయతీ అధికారులు సంయుక్తంగా ప్రణాళిక రచిస్తున్నారు. రెండు మూడురోజుల్లో కలెక్టర్ ఆమోదంతో తుది జాబితా సిద్ధం కానుంది.

ఆదిలాబాద్‌లో ఏజెన్సీ ప్రాంతాలు ఉండటంతో కొన్ని వైపుల అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఆ ప్రాంతాలను మినహాయించి మిగతా గ్రామాలు సంస్థ పరిధిలోకి వచ్చేలా కసరత్తు చేస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌ను కొలమానంగా తీసుకుని అక్కడి నుంచి చుట్టుపక్కల 20 కి.మీ వరకు ఉన్న గ్రామాల పేర్లను సేకరించారు. తొలుత ఈ సంస్థ పరిధి 10 కి.మీ. వరకే విస్తరించాలని చర్చించినా ఏజెన్సీ ప్రాంతం కారణంగా చాలా గ్రామాలు వదిలేయాల్సి రావడంతో విస్తరణ దూరం పెంచినట్లు సమాచారం.

బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లోని గ్రామాలు

పట్టణానికి ఆనుకుని ఉన్న ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు బోథ్ నియోజకవర్గంలోని పల్లె ప్రాంతాలకు సంస్థ పరిధి విస్తరించనుంది. ఏజెన్సీ ప్రాంతమైన ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి వైపు, యాపల్‌గూడ వైపు అడ్డంకులు ఉండటంతో వాటిని వదిలేశారు. పట్టణానికి ఆనుకుని ఉన్న ఆదిలాబాద్ గ్రామీణ మండలం పరిధిలోని చాంద(టి), భీంసరి, పొచ్చెర, మావల మండలం బట్టిసావర్గాం, మావల గ్రామాలు సంస్థ పరిధిలోకి రానున్నాయి. దూరంగా ఉన్న గ్రామాల ఎంపికపైనే తర్జనభర్జన కొనసాగుతోంది. నాలుగు వరుసల జాతీయ రహదారి ఉన్న జైనథ్ మండలం పెన్‌గంగ వరకు ఉన్న గ్రామాల పేర్లను సేకరించారు. జైనథ్ వరకు సంస్థ పరిధి విస్తరించి చుట్టుపక్కల ఉన్న గ్రామాలను చేర్చేలా కసరత్తు కొనసాగుతోంది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్ నుంచి భీంపూర్ వరకు ఉన్న గ్రామాలను ఇందులో చేర్చేలా ప్రణాళిక రచిస్తున్నారు. లాండసాంగ్వి నుంచి జైనథ్ వైపు ఉన్న గ్రామాలు సైతం సంస్థ పరిధిలోకి రానున్నాయి. తలమడుగు, తాంసి మండలాలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి సుంకిడి గ్రామ మార్గంలో వచ్చే గ్రామాలన్నీ ఎంపిక చేయనున్నారు. తాంసిని సైతం ఇందులో కలపనున్నట్లు తెలిసింది. ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం దేవాపూర్, కజ్జర్ల నుంచి బరంపూర్ వరకు ఉన్న గ్రామాలను సైతం ఎంపిక చేసే ఆలోచన చేస్తున్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రం ఆదిలాబాద్‌కు 20 కి.మీ. లోపలే ఉన్నా అటువైపు ఏజెన్సీ గ్రామాలే ఎక్కువగా ఉండటంతో వాటి జోలికి వెళ్లలేదని తెలిసింది. పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో మునుపటిలాగే పాలన యథావిధిగా కొనసాగనుంది.

యువతకు ఉపాధి.. పల్లెకు విస్తృతి

● మారుమూల ప్రాంతాలకు చేరిన ఈ-కామర్స్



✸ మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఘనుకోట విశ్వేశ్వర్ తనకు అవసరమైన గృహోపకరణాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. దాన్ని అతడి ఇంటి వద్దకు వెళ్లి ఈకామర్స్ సంస్థలో పనిచేస్తున్న యువకుడు జగదీశ్ అందజేశారు. మారుమూల గ్రామాల యువత, మహిళలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తూ తమకు నచ్చిన వస్తువులను తెప్పించుకుంటున్నారు.

చెన్నూరు, న్యూస్‌టుడే:

ఉమ్మడి ఆదిలాబాద్ అనగానే అడవుల జిల్లా అని పేరు. కానీ ఇక్కడి మారుమూల పల్లెలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. ఇంటి నుంచే ఆర్డర్ నమోదు చేయగానే తమకు నచ్చిన వస్తువు చేరుతుంది. దీని ద్వారా యువతకు ఉపాధి లభిస్తోంది. పల్లెలకు పాకిన ఈ-కామర్స్ సంస్థల విస్తృతిపై కథనం.



ఉమ్మడి జిల్లాలో నిత్యం ఆన్‌లైన్ వ్యాపారం తీరిలా..
- ఆర్డర్లు 2500
- సగటున కొనుగోళ్ల లావాదేవీలు రూ. 25 లక్షలు
- పండగ వేళల్లో రూ.50 లక్షలు
- ఉపాధి పొందుతున్న వారు 250
- ఆన్‌లైన్ కొరియర్ సంస్థలు 12

ఆన్‌లైన్‌లలో ఎక్కువగా కొనుగోలు చేస్తున్న వస్తువులివీ..
- ఆహార పదార్థాలు
- నిత్యావసరాలు
- ఎలక్ట్రానిక్ ఉపకరణాలు
- దుస్తులు, ఫ్యాషన్ సామగ్రి



✸ చెన్నూరు పట్టణానికి చెందిన అభిరామ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల అనంతరం, సెలవు దినాల్లో ఆయన ఓ సంస్థలో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికులు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు చేసినవి స్టాక్ పాయింట్ వద్దకు చేరుకోగా అక్కడి నుంచి వారి ఇళ్లకు వస్తువులను చేరవేస్తూ నెలకు రూ.12000 వరకు ఆదాయం పొందుతున్నాడు.


పెన్ను, పుస్తకం మొదలు.. ల్యాప్‌టాప్‌ల వరకు ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు.. వ్యాపారాల నిర్వహణకు ఉపకరించే సామగ్రి.. గృహోపకరణ, వస్త్ర, యంత్ర, సాంకేతిక సామగ్రి కొనుగోలుకు వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆ సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. దీంతో స్థానిక యువతకు ఉపాధి లభిస్తోంది. నిర్వాహకులు ద్విచక్ర వాహనాలు ఉన్న వారిని నియమించుకుంటున్నారు. నేరుగా వినియోగదారులకు అందిస్తున్నారు.


యువత, విద్యావంతులు, మహిళలు, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు ప్రస్తుతం ఈ-కొనుగోళ్ల విధానం వైపు మొగ్గుచూపుతున్నారు. అధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు. నిత్యావసర సరకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంట్లో గృహోపకరణాలకు అవసరమైనవన్నీ ఆర్డర్ చేసేస్తున్నారు.

వెలసిన ఏజెన్సీలు

జిల్లా కేంద్రాల్లో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగుతున్నాయి. 20 సంస్థలకు అనుబంధంగా శాఖల వారీగా సేవలు అందుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 రకాల ఆన్‌లైన్ సంస్థలు ఉన్నాయి. ప్రధాన పట్టణాలైన ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల తదితర పట్టణాల్లో ఈ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. స్టాక్ పాయింట్ నుంచి వీటిని ఆర్డర్ చేసిన వారి ఇళ్లకు చేరవేస్తూ పలువురు నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లపై జిల్లాలో 100 మంది యువతతో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వే వివరాలు ఇలా..





ఉద్యమానికి ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ


నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ రాజర్షి షా కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి హాజరయ్యారు. పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపూజీ జిల్లా వాస్తవ్యులు కావడం అందరికీ గర్వకారణమన్నారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆశమ్మ మాట్లాడుతూ కొత్తగా నిర్మించబోయే కలెక్టరేట్ భవన సముదాయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని కోరగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.


దంతనపల్లి - నర్సాపూర్ మధ్య వాగు దాటుతున్న వైద్యురాలు, సిబ్బంది


నర్సాపూర్‌లో వైద్య పరీక్షలు చేస్తూ..

వాగు దాటి.. వైద్యం అందించి

ఏజెన్సీలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు ప్రవహిస్తున్నాయి. కొన్ని రోజుల నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఉట్నూరు మండలం దంతనపల్లి పీహెచ్‌సీ పరిధిలోని నర్సాపూర్‌లో పలువురు జ్వరాల బారిన పడగా.. పీహెచ్‌సీ వైద్యాధికారి అనురాధ వైద్య సిబ్బందితో కలిసి వైద్య సేవలందించేందుకు వెళ్లారు. దంతనపల్లి - నర్సాపూర్ మధ్యలో వాగు ప్రవహిస్తున్నా దాన్ని దాటి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. - న్యూస్‌టుడే, ఉట్నూరు గ్రామీణం

రుచి బాగుంది!


అంగన్‌వాడీ కార్యకర్తలతో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

పోషకాహారంపై విస్తృత ప్రచారం అవసరమని మహిళా కమిషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. స్థానిక టీటీడీసీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక కూరగాయలు, పప్పుదినుసులు తదితరాలతో తయారు చేసిన పోషకాలున్న వంటకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పరిశీలించి వంటకాలను రుచి చూశారు. బాగున్నాయంటూ ప్రశంసించారు. - న్యూస్‌టుడే, ఎదులాపురం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి పశువుల పేడ, సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని రైతు వేదికలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలం మల్లాపూర్ గ్రామ గిరిజన రైతులతో పాటు కుమురం భీం జిల్లా తిర్యాణి మండలం పంగడిమాదర లోని గిరిజన రైతులు పాత పంటలను సాగు చేస్తున్నారన్నారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాంప్రసాద్, ఉట్నూరు ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలే మిన్నంటూ..

● పెరిగిన వరి సాగుతో అన్నదాతకు గిట్టుబాటు
● ఉమ్మడి జిల్లాలో రూ.191.50 కోట్ల మేర ప్రయోజనం

మంచిర్యాల వ్యవసాయం, నిర్మల్, న్యూస్‌టుడే:

ప్రస్తుత వానాకాలం నుంచే సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సన్నాలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది. సాగు ప్రారంభంలో సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో గతంతో పోలిస్తే ఈ సారి సాగు పెరిగింది. ఒక వేళ సన్నాలను వ్యాపారులు అంతకంటే ఎక్కువ ధరకే కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో రెండు రకాలుగా రైతులకు మేలు జరగనుంది. దీంతోపాటు అర్హులైన తెల్లరేషన్ కార్డులున్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తామని చెబుతుండటంతో అటు రైతులకు ఇటు సామాన్య ప్రజలకు ప్రయోజనం జరగనుంది.


లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ సమీపంలో సాగులో ఉన్న సన్నరకం వరి

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరతో సంబంధం లేకుండా వ్యాపారులు సన్నాలను కొనుగోలు చేస్తుండటంతో మద్దతు అంతంతమాత్రంగా ఉంటోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈ సారి సన్నాల సాగు అంచనాలను మించి పెరిగింది. ప్రభుత్వ సూచనల మేరకు 2021లో దొడ్డు రకాలను తగ్గించి సన్నాలతోపాటు మొక్కజొన్న, పప్పు దినుసులను అధికంగా సాగు చేశారు. సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు దిగుబడి బాగా వచ్చింది. అయితే సన్నాలను కొనేవారు లేకపోవడం, ప్రభుత్వం దొడ్డు రకాలను మాత్రమే కొనుగోలు చేయడంతో సన్నరకం రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ సారి సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో గిట్టుబాటు దక్కనుంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ.2,320 'బి' రకానికి రూ.2,300 ధర ఉంది. దీంతోపాటు రూ.500 బోనస్ కలిపితే 'ఏ' రకానికి రూ.2,820, 'బి' రకానికి రూ.2,800 దక్కనుంది.

ఉమ్మడి జిల్లాలో 3.48 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో సన్నరకాలు 1,91,500 ఎకరాల్లో పండిస్తుండగా.. మిగతా 1,56,500 ఎకరాల్లో దొడ్డురకం సాగు చేస్తున్నారు. సన్నరకం ధాన్యం ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాలో 38.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాలు పండించిన అన్నదాతలకు అదనంగా రూ.191.50 కోట్ల మేర మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లాలో సన్న, దొడ్డురకాల ధాన్యం కొనుగోలుకు 608 కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఒక కేంద్రంలో సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేసేందుకు వేర్వేరు కాంటాలు సిద్ధం చేస్తున్నారు.

రేషన్ లబ్ధిదారులకు ప్రయోజనం

ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులతో పాటు కొత్తగా పొందే రేషన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. దీనివల్ల కార్డుదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు దొడ్డు బియ్యమే ఇస్తుండగా వీటిని చాలా మంది తినకుండా అమ్ముకుంటున్నారు. బయట సన్నాలను కిలో రూ.50 వరకు కొనుగోలు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఇది అమలైతే పేదలకు తక్కువ ధరకు సన్నబియ్యం అందనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు వివరాలు (ఎకరాల్లో)

జిల్లా	సన్నరకం	దొడ్డురకం	మొత్తం
నిర్మల్	70,000	60,000	1,30,000
మంచిర్యాల	90,000	70,000	1,60,000
ఆదిలాబాద్	1,500	500	2,000
కుమురంభీం	30,000	26,000	56,000

తలసీమియా బాధితులకు వరం

- దేశీయంగా 'ఇన్‌ఫ్యూజ్ థల పంపు' అందుబాటులోకి..
- ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో ఉచితంగా అందిస్తే ప్రయోజనం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం : కొత్తగా అందుబాటులోకి వచ్చిన 'థల పంపు' సికిల్‌సెల్, తలసీమియా బాధితుల కెంతో ఉపయోగకరంగా మారనుంది. రక్తహీనతకు గురై తరచూ రక్తం ఎక్కించుకునే బాధితుల శరీరంలో అవసరానికి మించి పేరుకుపోయే ఐరన్‌ను తగ్గించటానికి ఇచ్చే సూది మందును వేయించుకోవటానికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంది. ఈ సూది మందును బాధితులకు సెలైన్‌లో కలిపి ఇస్తుంటారు. ఇలా ఇచ్చేటప్పుడు వారు పడకపై కనీసం 8 గంటల వరకు పడుకోవాల్సి వస్తుంది. కానీ థలపంపు ద్వారా ఆ ఇంజెక్షన్ తీసుకుంటే గంటల తరబడి పడకపై ఉండాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. పంపు బెల్ట్‌ను శరీరంపై అమర్చుకొని సాధారణ పనులు చేసుకోవచ్చు. నిర్ణీత సమయం పాటు ఆ సూది మందు చర్మంలోకి చేరిపోతుంటుంది.

ఇన్‌ఫ్యూజ్ థల పంపు ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీని విలువ ఆయా కంపెనీలను బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. నిరుపేద బాధితులు దాన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత కలిగి ఉండరు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా 'మేడ్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' కింద వైద్య పరికరాలు, ఔషధాల తయారీని ప్రోత్సహిస్తోంది. చెన్నైలోని వి టైటాన్ కార్పొరేషన్ ఇన్‌ఫ్యూజ్ థల పంపును దేశీయంగా తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల తలసీమియా రాష్ట్ర సొసైటీకి ప్రయోగాత్మకంగా పది థల పంపులను ఆ కంపెనీ అందజేసింది. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి సారి ముగ్గురు బాధితులకు ఆ కంపెనీ ప్రతినిధులు వాటిని ఎంపీ గోడం నగేష్ చేతుల మీదుగా అందించారు.


బాధితులకు థల పంపును పంపిణీ చేస్తున్న ఎంపీ నగేష్


ఇలా ఇన్‌ఫ్యూజ్ పంపును ఏర్పాటు చేసుకొని సూది మందు తీసుకోవచ్చు

ఉమ్మడి జిల్లాలో బాధితులు ఇలా..
తలసీమియా : 2021
సికిల్‌సెల్: 565

చాలా సులువు..

ఇన్‌ఫ్యూజ్ పంపు ద్వారా సూది మందు వేసుకోవటం చాలా సులువుగా ఉంటుంది. సూది మందును పంపులో లోడ్ చేసి శరీరంపై ఎక్కడ దాన్ని తీసుకోవాలో అక్కడ ఆ పంపును బెల్ట్ ద్వారా బిగించేస్తే సరి. దానిలో ఏర్పాటు చేసిన సూది ద్వారా చర్మంలోకి నిర్ణీత మోతాదులో ఆ మందు వెళ్లిపోతుంటుంది. ఈ సమయంలో బాధితులు సాధారణ పనులన్నీ చేసుకోవచ్చు.

విధిగా సూది మందు..

తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు తరచూ రక్తం ఎక్కించుకోవటం వల్ల వారి శరీరంలో అత్యధికంగా ఐరన్ పేరుకుపోతుంది. శరీరంలోని అవయవాలు వ్యాధులకు గురై మృతి చెందే ప్రమాదం ఉంటుంది. బాధితుల శరీరంలో పేరుకుపోయిన ఐరన్‌ను తొలగించటానికి సూది మందు వేయించుకోవటం అత్యవసరం. ప్రత్యామ్నాయంగా మాత్రలు ఉన్నా వాటితో ఆశించిన ఫలితాలు ఉండవంటున్నారు.

ప్రభుత్వం దృష్టి పెడితే మేలు..

సికిల్‌సెల్, తలసీమియా వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నాయి. ఇన్‌ఫ్యూజ్ పంపు, సూది మందులు మాత్రం అందులో లేవు. దేశీయంగా తయారు చేసిన థల పంపు కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు భరించే ఆర్థిక స్తోమత పేద రోగులకు ఉండదు. సూది మందు సైతం బయట మార్కెట్‌లో రూ.200 ఉంటుంది. వీటిని ఆరోగ్యశ్రీలో చేర్చి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తే మేలు చేసిన వారవుతారని బాధితులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు సాయం

తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన పాపయ్య, సుభద్ర దంపతుల మొదటి కుమారుడు చిల్పిప్ప విజయ్‌కుమార్. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ, మేనత్తలు మహాదేవ లక్ష్మీకాంతయ్య, సీతమ్మలు ఆతడిని దత్తత తీసుకొని పెంచుకున్నారు. అచ్చలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి, అనంతరం 3 సంవత్సరాలు వేద విద్యను పూర్తి చేశారు. మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుకున్నారు. కొలువు సాధించి సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన భార్య శీల గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె పేరిట స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అచ్చలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు చేయించారు. పాఠశాలకు 10 గుంటల క్రీడా స్థలం కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ, గేటు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో కార్యక్రమాల నిర్వహణకు ఓ వేదిక నిర్మించారు. తరగతి గదుల పైకప్పు శిథిలావస్థకు చేరడంతో జనప రేకులు వేయించి మరమ్మతులు చేయించారు. బాలికల శౌచాలయాల మరమ్మతులకు రూ.80 వేలు, ల్యాప్‌టాప్, ప్రింటర్‌కు రూ.50 వేలు, ఆవరణ మరమ్మతులకు రూ.50 వేలు, సైన్స్ పరికరాలు, క్రీడా సామగ్రికి రూ.50 వేలు వివిధ సందర్భాల్లో ఇచ్చారు.


చిల్పిప్ప విజయ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి


పాఠశాలలో ఏర్పాటు చేసిన గేటు


అచ్చలాపూర్ పాఠశాలకు ఇచ్చిన ఆట స్థలం

సామాజిక తోవ.. చదువుకున్న బడికి సేవ

తాండూరు, న్యూస్‌టుడే: పుట్టి పెరిగిన ఊరు.. చదువుకున్న బడిని గుర్తుంచుకోవడమే కాదు వీటిని అభివృద్ధి చేయాలి అనుకునే వారు కూడా ఉంటారు. నేడు ఈ పూర్వ విద్యార్థులను చూస్తే అర్థమవుతోంది. వారు చదువుకున్న రోజుల్లో వసతులు లేక పడిన కష్టాలను తమ ఊరి విద్యార్థులు పడకూడదనుకున్నారు. పుట్టి పెరిగిన ఊరి బాగు కోసం.. చిన్ననాడు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించారీ దాతలు.

ఆటల కోసం స్థలం కొనుగోలు

కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన మాదవరపు సంతోష్‌రావు చిన్నతనంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నత స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో రూ.12 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. జన్కాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఆట స్థలం కోసం 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీని నిర్మించి గేటు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు ఆట వస్తువులు అందించారు. శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేశారు. 6 కంప్యూటర్లు అందజేశారు.


జన్కాపూర్ పాఠశాలకు కొనిచ్చి ప్రహరీ ఏర్పాటు చేయించిన ఆట స్థలం


జన్కాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అందించిన కంప్యూటర్లు

నిరుద్యోగుల పక్షాన పోరాడతా

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో జరిగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో తాను ఈసారి బరిలో నిలువనున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తూ విద్యావేత్తగా అనుభవం ఉన్న తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటానన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకు బలం పెంచే విధంగా ఈ సారి వంద శాతం ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోవద్దని, పట్టభద్రుల్లో చైతన్యం పెంచే లక్ష్యంతో గత 15 రోజుల నుంచి తమ ప్రతినిధులతో ఓటు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన పార్టీనుంచి టికెట్ ఆశిస్తున్నానన్నారు. టికెట్ వస్తే పార్టీ తరపున పోటీ చేస్తానని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

తొలిరోజు 30 మంది హాజరు



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2008లో ఎంపికైన బీఈడ్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ఆదిలాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ప్రారంభమైంది. తొలిరోజున మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 30 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అక్టోబరు 5వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందని డీఈవో ప్రణీత తెలిపారు. కమిటీ సభ్యులు సుకుమార్, మహేందర్‌రెడ్డి అభ్యర్థులు పూరించిన పత్రాలతో పాటు ఆయా ధ్రువపత్రాలను పరిశీలించారు.

ఆలయాల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ఆలయాల సంరక్షణ కోసం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని గన్నవరం భువనేశ్వర మఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామి కోరారు. జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక నటరాజ్‌నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డూప్రసాద తయారీలో జరిగిన కల్తీ విషయం ప్రస్తుత హిందూ సమాజాన్ని గాయపర్చిందన్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ తిరుపతి పర్యటనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వ్యక్తిగతంగా క్రైస్తవ మత సిద్ధాంతం ఆచరించే ఆయన నిజాయతీగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఆచార వ్యవహారాలను దెబ్బతీసే ప్రయత్నం చేయొద్దని, ఓట్ల కోసం హిందువుల్లాగా నటించొద్దని హితవు పలికారు. ఎవరి మతాచారాలు వారివేనని, ఎవరికివారు స్వేచ్ఛగా ఆచరించుకోవచ్చని, అదే సమయంలో అన్నింటినీ గౌరవించాలన్నారు. హిందూ ఆలయాలకు అన్య మతస్థులు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వెళితే అక్కడి దైవాన్ని నమ్ముతున్నామనే అంగీకారం తెలపాలని సూచించారు. రాజకీయ నాయకత్వం నచ్చితే నాయకులు ఏ మతం వారైనా ఓట్లు వేస్తారని, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం తమ చేతల ద్వారా మతవైషమ్యాలు తీసుకురావొద్దని చెప్పారు. సమావేశంలో విభాగ్ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పతికె రాజేందర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, మాతృశక్తి ప్రాంత సహ సంయోజిక సద్ది శ్రీవాణి, జిల్లా సహ సంయోజిక సిరి, నాయకులు చింతకుంట శ్రీనివాస్, పతికె రమేశ్, అయ్యన్నగారి భూమయ్య, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

ముథోల్(బాసర): బాసర అమ్మవారిని శుక్రవారం కమలానందస్వామి దర్శించుకొన్నారు. వేదపండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి, తదితర పూజలను నిర్వహించారు. భాజపా నాయకులు సతీశ్వర్‌రావు, సుభాష్‌యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. బాలుర విభాగంలో పి.సాయిచరణ్, సీహెచ్.గోపాలశ్రీ కృష్ణ, డి.ప్రేమ్‌దీప్, డి.సిద్దార్థ, సీహెచ్.నిఖిల్, కె.అక్షిత్, ఏ.అఖిల్, టి.రుద్రధ్రువ, నందం, ఆర్.అక్షయ్, కోచ్‌లుగా కుందారపు నరేష్, మేనజర్‌గా మల్లేష్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. బాలికల విభాగంలో టి.ప్రజ్వల, ఎస్.సాయి శ్రీవర్శిణి, ఎం.సహస్ర, స్ఫూర్తికారుణ్య, డి.వేరొనిక, డి.నవ్య, టి.జాన్సీ, సీహెచ్. లక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. కోచ్‌గా జి.గోపాల్, మేనేజర్‌గా కె.భాస్కర్ వ్యవరించనున్నట్లు పేర్కొన్నారు. వీరికి శనివారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో కోచింగ్ క్యాంపు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శి తిరుపతి, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, బెల్లంపల్లి ఏరియా పర్సనల్ అధికారి రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, కమిటీ సభ్యులు


వేదికపై రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకున్న భారాస ఎమ్మెల్యే

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగాన్ని భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. రాజయ్య మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీతో తనకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇవ్వకపోయి ఉంటే ప్రజలు ఎవరిని తిట్టుకునేవారని? ఇస్తే ఎవరికి లాభం జరగాలి? కానీ ఎవరికి లాభం జరిగింది.. ఎవరు పదవులను అనుభవిస్తున్నారని ప్రశ్నించారు. బాపూజీ అంత్యక్రియలు ఆయన సొంత స్థలం జలసౌదలో నిర్వహించాలని నేను పట్టుబట్టానన్నారు. కొందరు నన్ను భయపెట్టారని అన్నారు. భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహంతో ఆయన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు అనిల్ జాదవ్‌ను ఆపారు. రాజయ్య ప్రసంగాన్ని ముగించే వరకు సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ అలాగే నిలబడి ఉన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడాల్సిన సమయం కాదని, సమావేశంలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని అనిల్ జాదవ్ మండిపడ్డారు. నేను భారాస గురించి మాట్లాడటం లేదని రాజయ్య జవాబిచ్చారు. రాజయ్య తన ప్రసంగాన్ని ఆపకపోవటంతో పలువురు పద్మశాలీ సంఘం నాయకులు కల్పించుకొని సమావేశాన్ని ఆపించారు.

విద్యుత్తు శాఖలో బదిలీల విధివిధానాలు విడుదల

మంచిర్యాల సిటీ: ఎట్టకేలకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని విభాగాల బదిలీలకు రంగం సిద్ధమైంది. విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. జూన్ 30వరకు ఒకేచోట రెండేళ్లు పూర్తిచేసుకున్న వారందరూ బదిలీకి అర్హులే అని అందులో పేర్కొన్నారు. వచ్చేనెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి కానుంది. జిల్లాలో పాతుకుపోయిన సిబ్బంది, సంఘాల నాయకులు, వారి అనుచరులకు తప్పితే మిగతా వారికి ఉపయోగం అంతంత మాత్రమే అని సంస్థలోని ఉద్యోగుల నుంచే విమర్శలు వస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకు బదిలీకి అర్హత ఉన్నవారి వివరాలు అందించాలని ఆదేశాలు రావడంతో ఎస్ఈ కార్యాలయ సిబ్బంది అందులో నిమగ్నమయ్యారు.

శభాష్.. శివ!

- యూట్యూబర్‌గా రాణిస్తున్న పల్లెటూరి కుర్రాడు

తెలుగు మాధ్యమంలో చదివిన ఆ పల్లెటూరి కుర్రాడు బీటెక్‌లో చేరగానే ఆంగ్లంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్టు వర్క్‌లు, ప్రజెంటేషన్లు ఇచ్చే సమయంలో ఆ భాషలో మాట్లాడేందుకు తన లాగే చాలా మంది బాధపడుతున్నారని గుర్తించారు. దీన్ని అధిగమించేందుకు సులువైన మార్గాలను అన్వేషించారు. యానిమేషన్ ద్వారా చెబితే అర్థం చేసుకోవచ్చని భావించి యూట్యూబ్ ద్వారా మూడు భాషల్లో వీడియోలు రూపొందించి ఆంగ్ల పాఠాలు బోధిస్తూ యూట్యూబర్‌గా రాణిస్తున్నారు. -న్యూస్‌టుడే, భైంసా గ్రామీణం


సాధించిన గోల్డెన్ ప్లే బటన్‌తో.. శివ

నిర్మల్ జిల్లా భైంసా మండలం లింగా-1 గ్రామానికి చెందిన గాడేకర్ శివ.. ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసమంతా తెలుగు మాధ్యమంలోనే పూర్తిచేశారు. ఇంజినీరింగ్(సివిల్) ఆంగ్ల మాధ్యమం కావడంతో చేరినప్పటి నుంచి ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ప్రాజెక్టు వర్కులు, ప్రజెంటేషన్లు ఇచ్చే క్రమంలో. ఆంగ్ల భాషను ఎక్కడ, ఎలా నేర్చుకోవాలో తెలియని అయోమయ స్థితి ఎదురైంది. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి తనలాగే సమస్య ఉందని గుర్తించి ఎలాగైనా దీన్ని గట్టెక్కాలని నిర్ణయించుకున్నారు.


గాడేకర్ శివను అభినందిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్

పది లక్షలకు పైగా వీక్షకులు

గూగుల్, యూట్యూబ్‌లను అనుకూలంగా మార్చుకుని మొదట ఆయన ఆంగ్లంపై పట్టు సంపాదించారు. దీని కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. యానిమేషన్ (బొమ్మలతో)లో చెబితే చక్కగా అర్థం చేసుకోవచ్చని నిర్ణయానికి వచ్చారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో యానిమేషన్‌లో పాఠాలు రూపొందించి యూట్యూబ్ ఛానల్ 'గాడేకర్ శివ' ద్వారా వీడియోలు పొందుపర్చారు. ఇలా అయిదేళ్లలో 259 వీడియోలు అప్‌లోడ్ చేయగా.. 10,14,000 మంది సబ్‌స్క్రైబర్లుగా (వీక్షకులు) చేరారు. ఈ వీడియోలను 5,84,49,000 మందికి పైగా వీక్షించారు. శివ ప్రతిభను గుర్తించిన యూట్యూబ్ ఇటీవల గోల్డెన్ ప్లేబటన్ (బంగారు పలక) పంపించింది.



శివ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన మూడు భాషల వ్యాఖ్యలు

అరబ్ దేశాల నుంచి ఆదరణ

స్పోకెన్ ఇంగ్లిష్, భాషా నైపుణ్యంపై పాఠాలను కొత్తగా రూపొందిస్తున్నారు. సందర్భానుసారంగా ఆంగ్ల పదాలు, వ్యాఖ్యలు, యానిమేషన్ చిత్రాలతో రూపొందించిన వీడియోలు చక్కటి ఆదరణ పొందుతున్నాయి. వీడియోలకు తానే వ్యాఖ్యానం ఇస్తున్నారు. మొదట తెలుగు, హిందీ, భాషల్లో వీడియోలు చేశారు. అరబ్ దేశాల్లోని వీక్షకులు ఉర్దూలో కావాలని కోరడంతో.. హిందీలో వారికి పంపి ఉర్దూలో తర్జుమా చేయించారు. అలా ఉర్దూలోనూ వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. తన వీడియోల ద్వారా కోటి మంది వీక్షకులను చేర్పించి డైమండ్ ప్లే బటన్ సాధించడమే తన లక్ష్యమని శివ చెబుతున్నారు.

వెలుగులోకి పురాతన భైరవ విగ్రహం

కుంటాల, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కుంటాలలోని ప్రాచీన గ్రామదేవత గజ్జలమ్మ ఆలయానికి తూర్పున సుమారు వంద మీటర్ల దూరంలో క్రీస్తు శకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు చెక్కిన భైరవుని విగ్రహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావ్ తెలిపారు. రాష్ట్రకూటుల కాలంలో ఈ గ్రామం వైభవంగా వెలిగినట్లు ఇక్కడ వెలుగులోకి వచ్చిన విగ్రహాలతో తెలుస్తోంది. భైరవ సంప్రదాయం ఇక్కడ కొనసాగినట్లు ఇక్కడ శిల్పసంపద తేటతెల్లం చేస్తోంది. నిర్మల్ జిల్లా ప్రాంతం రాష్ట్రకూట రాజు 2వ కృష్ణుని ఏలుబడిలో ఉన్నట్లు దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలుస్తోంది. వెలుగులోకి వచ్చిన భైరవ విగ్రహంలో పెద్ద దమ్మిల్లా జటఝూటం, పెద్ద కుండలాలు, కర్ణాభరణాలు, మెడలో హారంతోపాటు కాపాలజంధ్యం, నిజహస్తాల్లో కత్తి, రక్తంతో కూడిన పాత్ర, పరిహస్తాల్లో దండకం డమరుకం ఉన్నాయి. దండకడియాలు, ముంజేతి కంకణాలు, మొలతాడు కలిగి త్రిభంగిమలో వైతస్తిక పాదభంగిమలో ఉన్నాడు. కాళ్లకింద సర్పవాహనం ఉండే అవకాశం ఉంది. కానీ భూమిలో కుంగిపోయి ఉన్నందున వాటిని గుర్తించలేకపోయామని దేవరావ్ వివరించారు. విగ్రహ లక్షణాలు బట్టిచూస్తే అష్ట భైరవుల్లో కాల భైరవునిగా చెప్పొచ్చు. ఇదే కాకుండా 16వ శతాబ్దపు మరో విగ్రహం ఈ ప్రాంతంలో గుర్తించామని, ఆ భైరవుని లక్షణాలు కూడా రాష్ట్రకూట భైరవుని విగ్రహం పోలి ఉన్నాయని పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో చరిత్ర పరిశోధకులు అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి, తుమ్మల సుజాత పాల్గొన్నారు.


కుంటాలలో భైరవ విగ్రహం చూపుతున్న దేవరావు

పకడ్బందీగా వన్యప్రాణుల సంరక్షణ నిబంధనల అమలు

ఏసీసీ, న్యూస్‌టుడే: కవ్వాల్ అభయారణ్యం పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ, అటవీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అభయారణ్యం పరిధిలో నిబంధనల అమలుపై దండేపల్లి, జన్నారం మండలాల అధికారులతో చర్చించారు. అక్రమ వ్యాపారాలు, నిర్మాణాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పర్యావరణ చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అభయారణ్యం చుట్టూ కిలోమీటరు మేర ఏకో సెన్సిటివ్ జోన్, 10 కిలోమీటర్ల మేర రేడియస్ జోన్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 90309 25238
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 96031 04720
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, గుడిహత్నూర్

? గుడిహత్నూర్ అంతర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్ అయి సంతకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. - ప్రశాంత్, గుడిహత్నూర్

✓ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న సంతకు వెళ్లడానికి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటాం. - ఇమ్రాన్, ఎస్ఐ, గుడిహత్నూర్

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తా



ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : కేస్లాపూర్, ఇంద్రవెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో భోజనశాలలు నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. శుక్రవారం కేస్లాపూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కేస్లాపూర్ పంచాయతీ మాజీ సర్పంచి మెస్రం రేణుక ఆయా పాఠశాలల్లో సమస్యలపై శుక్రవారం 'ఎండైనా.. వానైనా.. 'వేదే' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం వచ్చిందని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. బాలికలతో ఆమె స్వయంగా మాట్లాడారు. అంతకు ముందు నాగోబాను దర్శించుకొని పూజలు చేశారు. సభ్యురాలు ఈశ్వరీబాయి, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, మహిళా కమిషన్ అధికారులు, ఉట్నూరు డీఎస్పీ నాగేందర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార పట్టిక ప్రకారం భోజనం అందించాలి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ఆహార పట్టిక ప్రకారం భోజనాలు అందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. 'ఆటకెక్కిన ఆహార పట్టిక', 'ఎండైనా.. వానైనా.. వేదే' అనే శీర్షికలతో 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన కథనాలకు పీఓ స్పందించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇస్తున్నారా? అని విద్యార్థులను ప్రశ్నించగా.. కోడి గుడ్డు ఇవ్వడం లేదని, 19వ తేదీ నుంచి ఆశ్రమానికి కోడి గుడ్లు సరఫరా కావడం లేదని పీఓ దృష్టికి తీసుకొచ్చారు. గుత్తేదారుతో చరవాణిలో మాట్లాడి గుడ్లు సరఫరా చేయాలని ఆదేశించారు.

తీరని నీటి సమస్య




బేల, న్యూస్‌టుడే : బేల మండలం చప్రాలలోని వార్డు నెం.1, 2లో మిషన్ భగీరథ ద్వారా కుళాయి నీరు సక్రమంగా రాకపోవడంతో స్థానికులు సమస్యను 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 22న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎస్.ఆర్.విజయ్ మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఉన్న రెండు మంచి నీటి బోరుబావులు పూర్తిస్థాయిలో నింపకపోవడంతో ఆ కాలనీలకు కుళాయి ద్వారా నీరు సరఫరా కావడం లేదని చెప్పడంతో శుక్రవారం పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీళ్లు వదిలారు. ఆయా కాలనీలకు నీటి సరఫరా కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేర వార్తలు

ఇంటి దీపం ఆరిపోయింది!

జ్వరంతో బాలిక మృతి



చందాల సహస్ర

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : పెళ్లయిన కొన్నేళ్లకే భర్త మరణిస్తే, ఉన్న ఒక్క కూతురే సర్వస్వం అనుకొని బతుకుతున్న ఆ తల్లికి కడుపుకోత మిగిలింది. చిన్న కూతురిని అల్లారు ముద్దుగా... ఆ దేవుడు దూరం చేశాడు. బోథ్ మండలం సొనాలకు చెందిన అంది భూమన్న-రాధాబాయిల కుమార్తె రమణక్క. ఆమెకు నిర్మల్ జిల్లా బన్సపల్లికి చెందిన చందాల శ్రీనివాస్‌తో పెళ్లయింది. కొన్నేళ్లకే భర్త మృతి చెందాడు. సొనాలలోనే తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. ఆమెకు ఓ కూతురు సహస్ర (13) ఉంది. బాలికకు పది రోజుల కిందట జ్వరం వచ్చింది. స్థానికంగా ఆసుపత్రులలో చికిత్స అందించినా తగ్గలేదు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్దే ఆడుకుంటూ తీవ్ర అస్వస్థతకు గురైంది. బోథ్ సివిల్ ఆసుపత్రికి అక్కడి నుంచి నిర్మల్‌కు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆ తల్లి రోదన మిన్నంటింది.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగికి జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే : గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ లంచం తీసుకున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మోకారాల శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కేలం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన నరసింహారెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ప్రాజెక్టు డైరెక్టర్ ఆయన సస్పెన్షన్ రద్దు చేస్తూ ఆ వారం రోజులను ఎర్నుడ్ లీవ్ సెలవుల కింద పరిగణించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల అమలు కోసం 2009, ఏప్రిల్ 13న ఉట్నూర్‌లోని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మోకారాల శ్రీధర్‌ను నరసింహారెడ్డి ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన రూ.3 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో నరసింహారెడ్డి 2009, ఏప్రిల్ 28న ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా అనిశా ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్.. రూ.3 వేల లంచం తీసుకున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. తదుపరి ఇన్‌స్పెక్టర్ మోహన్.. కోర్టులో ఈ మేరకు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిశోర్‌కుమార్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కుమార్ వివేక్ శుక్రవారం శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు నమోదు చేసేనాటికి శ్రీధర్ వయసు 56 సంవత్సరాలు. ప్రస్తుతం 70 ఏళ్ల వయసులోనూ ఆయనకు శిక్ష పడటం గమనార్హం.

గంజాయి విక్రేత రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న బేల మండలానికి చెందిన కొడప సుభాష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఎస్సై విష్ణు ప్రకాశ్, రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా నిందితుడిని అరెస్టు చేసి 56 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బస్సు చక్రాల కింద పడి గేదెలు మృతి

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : బస్సు చక్రాల కింద పడి రెండు గేదెలు మృతి చెందిన ఘటన పట్టణంలోని తెలంగాణ కూడలిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మలుపు తిరుగుతున్న సమయంలో రోడ్డుపై పడుకొని ఉన్న గేదెలు బస్సు వెనుక చక్రాల కింద పడటంతో మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లిలో జూదమాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. వారి నుంచి రూ.2760 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



తాంసి : నివాళులర్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మి, సిబ్బంది



ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



బోథ్ : ఏఎంసీ ఛైర్మన్ గంగారెడ్డి, నాయకులు



జడ్పీ మాజీ అధ్యక్షుడు రాఠోడ్ జనార్దన్, పుర అధ్యక్షుడు ప్రేమేందర్

ఆదిలాబాద్ అర్బన్, తాంసి, ఇచ్చోడ, బోథ్, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమంలో ఆది నుంచి పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తి గొప్పదని వక్తలు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



ఆదిలాబాద్ : కాంగ్రెస్ నేతలు సుగుణ, గజేందర్ తదితరులు

ఘనంగా జోనల్‌స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం



విల్లు ఎక్కుపెట్టిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూరు, న్యూస్‌టుడే : గిరిజన సంక్షేమ విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడోత్సవాలు శుక్రవారం ఉట్నూరు కుమురం భీం మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ సాంకేత్‌లు పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్, ఏపీవో వసంత్‌రావు, ఏటీడీఏవోలు క్రాంతి, అమిత్, నిహారిక, జిల్లా క్రీడాధికారి పార్థసారథి, పీడీలు రమేష్, హేమంత్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం చేతపట్టి.. పాఠాలు బోధించి

ఇంద్రవెల్లి: ఉట్నూరు ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి గదిలోకి వెళ్లి అర గంట వరకు ఆంగ్లంలో విద్యార్థులకు విద్యా బోధన చేశారు.

ఎన్‌సీసీ ఎంపిక పరీక్షలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల(పురుషులు)లో శుక్రవారం 32 తెలంగాణ పటాలం ఆధ్వర్యంలో ఎన్‌సీసీలో చేరేందుకు సైనిక సిబ్బంది ఎంపిక పరీక్షలు నిర్వహించారు. పరుగు, పుషప్స్, లాంగ్‌జంప్ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపికైన ఎన్‌సీసీ కెడెట్లను కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మిప్రసన్న, వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.శివకృష్ణ, ఎన్‌సీసీ శిక్షకుడు బి.గోపాల్ అభినందించారు. నాయబ్ సుబేదార్ రవికుమార్, హవల్దార్ రవీందర్ పర్యవేక్షణలో ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది.



విద్యార్థుల పుషప్స్ పరిశీలిస్తున్న ఎన్‌సీసీ నాయబ్ సుబేదార్ రవికుమార్, హవల్దార్ రవీందర్

అక్రమ వసూళ్లు.. ఆదివారం హాజరు

ప్రజా వేదికలో బయట పడిన అవకతవకలు



ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం, పాల్గొన్న డీఆర్‌డీవో సాయన్న, అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలంలో ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 01.04.2023 నుంచి 01.03.2024 వరకు రూ.4.68 కోట్లతో చేపట్టిన 666 పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. డీఆర్‌డీవో సాయన్న, అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు, ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి సమక్షంలో తనిఖీలో గుర్తించిన లోపాలను తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్ పంచాయతీలో క్షేత్ర సహాయకుడు ప్రహ్లాద్ ఉపాధి కూలీల నుంచి రూ.1.11 లక్షలు వసూలు చేసినట్లు తేలడంతో అతడిని అధికారులు విధుల నుంచి తొలగించారు. గ్రామానికి చెందిన కూలీలు ప్రహ్లాద్ చేసిన అక్రమ వసూళ్లను ప్రజావేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామంలోనే అయిదు ల్యాండ్ లెవలింగ్ పనులు జరగకున్నా జరిగినట్లు గుర్తించారు. ఒకరికి బదులుగా మరొకరు పనులకు వెళ్లడం.. సెలవు దినం ఆదివారం కూడా పనులకు వెళ్లినట్లు హాజరు వేసినట్లు గుర్తించారు. పంచాయతీ కార్మికులు సైతం పనులకు వెళ్లినట్లు వెల్లడించారు. అంకోలి గ్రామంలో క్షేత్ర సహాయకుడు అనారోగ్యంతో ఉన్నందున సుమారు రూ.9 లక్షలకు సంబంధించిన 32 పనులను తనిఖీ బృందానికి చూపించలేదు. రికవరీ, జరిమానాలకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సన్నద్ధం

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుల నుంచి పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సన్నద్ధం కావాలని మార్కెటింగ్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. మార్కెటింగ్ ఏడీ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కార్యదర్శులు, సిబ్బందితో శుక్రవారం జరిగిన సమావేశానికి హాజరై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా, మార్కెట్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. డీడీఎం పద్మావతి, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం ఏడీలు గజానన్, షాబుద్దీన్, శ్రీనివాస్, అశ్వక్, కార్యదర్శి మధుకర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పలువురి ముందస్తు అరెస్టు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలో పలువురు ముస్లిం నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. జైనూర్ ఘటనలో ముస్లిం బాధితులకు న్యాయం చేయాలంటూ శుక్రవారం ప్రార్థనల అనంతరం ర్యాలీ నిర్వహించటానికి పలువురు సిద్ధం కాగా పోలీసులు ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల పోలీసు స్టేషన్‌ల పరిధిలో 11 మందికిపైగా నాయకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ర్యాలీ విషయం తెలుసుకున్న ఎస్పీ గౌష్ ఆలం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ముస్లిం నాయకులతో సమావేశమై వారితో చర్చించారు. జైనూర్ ఘటనలో ప్రస్తుతం శాంతియుత వాతావరణం నెలకొంటున్న సమయంలో ర్యాలీలు తీయటం సరికాదని వారికి నచ్చచెప్పారు. దీంతో ముస్లిం నాయకులు ర్యాలీని రద్దు చేసుకున్నారు. కొందరు నాయకులు ఎస్పీకి న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చారు.

బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బంజారాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన అఖిల భారతీయ బంజారా సేవాసంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కులదైవం జగదంబ దేవి, సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూలమాల వేసి పూజలు చేశారు. డా.జైసింగ్ రాఠోడ్, నరేందర్ రాఠోడ్, సురేష్ నాయక్, హీరాలాల్ నాయక్, పవన్ నాయక్ సుభాష్ జాదవ్, బలిరాం, వినాయక్ జాదవ్, నారాయణ, బాబూలాల్, కిషన్ చవాన్, మధుకర్, శ్యామ్, జాదవ్ కృష్ణ, రోహిదాస్ రాఠోడ్, శ్యామ్‌రావు రాఠోడ్, సేవాలాల్ సేన, లంబాడీ హక్కుల పోరాట సమితి, బంజారా యువసేన నాయకులు పాల్గొన్నారు.



జగదంబ దేవి, సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అభివృద్ధి పనులు ప్రారంభం..

బోథ్: బోథ్ కేజీబీవీ పాఠశాలలో రూ.5 లక్షలతో ప్రహరీ, ఆదర్శ పాఠశాలలో రూ.5 లక్షలతో ప్రహరీ పనులు, రూ.5 లక్షలతో ఆటస్థల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఆదర్శ పాఠశాలలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సంధ్యారాణి, భారాస మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఎస్‌వో వలిత, నాయకులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, సురేందర్ యాదవ్, లింగారెడ్డి, రుక్మణ్‌సింగ్, తాహెర్‌బిన్, ఎల్క రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో ముచ్చటించి.. భోజనం చేసి!



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ గ్రామీణం(అంకోలి), న్యూస్‌టుడే : అంకోలి అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేసి రుచి, నాణ్యతను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న పోషకాహారం, సౌకర్యాలపై ఆరా తీశారు. పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. డ్రై డే కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో కలియతిరిగారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంకోలి పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. డీఆర్‌డీవో సాయన్న, మండల ప్రత్యేకాధికారి పద్మభూషణ్‌రాజ్, డీఎల్‌పీవో ఫణిందర్, ఎంపీడీవో నాగేశ్వర్, పీహెచ్‌సీ వైద్యుడు సర్ఫరాజ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త వందనలు కలెక్టర్ వెంట ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



కోర్టు ఆవరణలో చెత్తను ఊడ్చి ఎత్తుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, న్యూస్‌టుడే : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా న్యాయస్థానాల సముదాయ ఆవరణలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణలో చెట్ల కింద పేరుకుపోయిన చెత్తను కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో కలిసి ఆయన ఊడ్చి శుభ్రం చేశారు. వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. న్యాయమూర్తులు పి.శివరాంప్రసాద్, ప్రమీలా జైన్, మంజుల సూర్యవార్, జిల్లా కోర్టు ఏఓ శశికాంత్, పర్యవేక్షకుడు అశోక్, దుర్గారాణి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి బొనగిరి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, కార్యదర్శి సంతోష్, న్యాయవాదులు భావన, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో పరిసరాలను శుభ్రం చేస్తున్న జడ్జి బి.హుస్సేన్, కోర్టు సిబ్బంది

బోథ్: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.హుస్సేన్ అన్నారు. బోథ్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు విజయ్‌కుమార్, కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్‌ఎస్‌ఏ వైద్య శిబిరానికి విశేష స్పందన



బాధితులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కేఆర్‌కే కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ముఖ్య న్యాయవాది దాసరి గంగారాం, ఉప న్యాయవాది అర్గుల అశోక్, ప్యానల్ న్యాయవాది అజయ్, వైద్యులు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

బేల, న్యూస్‌టుడే : మండలంలో కొలాం ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కె.రఘునాథ్‌రావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బూరాన్‌పూర్ సర్వే 29/ఏలో కుంరం సూరు సంఘ భవనానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. మండల అధ్యక్షుడు జంగు, రాజు, అయ్యు, మారుతి, శత్రుఘన్ ఉన్నారు.

వయోవృద్ధుల వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న వయోవృద్ధులు

భుక్తాపూర్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో శుక్రవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో వయోవృద్ధులు అరగంట నడక సాధన చేశారు. కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాట్లాడి వారిని ఉత్సాహపరిచారు. జిల్లా అధ్యక్షుడు డా.దేవిదాస్ దేశ్‌పాండే, డా.డి.ఎన్.స్వామి, సభ్యులు గుండయ్య, రామ్‌కులకర్ణి, లింగయ్య, అఫ్సర్‌ఖాన్, పోశెట్టి, మోసిన్ ఉన్నారు.

■ అద్దె చెల్లించని దుకాణాలు సీజ్

ఆదిలాబాద్ సాంస్కృతికం: జిల్లా కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర మందిరానికి 50 దుకాణ సముదాయాలు ఉన్నాయి. అందులో 3 ఖాళీగా ఉండగా 47 దుకాణాలు అద్దెకిచ్చారు. 2018 నుంచి అద్దె బకాయి రూ.38,84,131 రావాల్సి ఉండటంతో శుక్రవారం ఆలయ ఈవో బల్లు రమేశ్, ఆలయ ట్రస్టు సభ్యులు, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి దుకాణానికి వెళ్లి అద్దె వసూలు చేశారు. చెల్లించని 4 దుకాణాలను సీజ్ చేశారు.

■ అత్తపై దాడి చేసిన నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్ నేర విభాగం: భార్యను పంపించడం లేదన్న కోపంతో అత్తపై కొడవలితో దాడి చేసిన అల్లుడు పూనెవార్ పునీత్(30)ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

■ అంగన్‌వాడీల వినతి

ఎదులాపురం: పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.ఒక లక్ష చెల్లిస్తామని ప్రకటించిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని అంగన్‌వాడీల సంఘం(టీఎన్జీఓ అనుబంధం) కోరింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు గురువారం ఇక్కడ వినతి పత్రాన్ని అందజేశారు. పింఛను సైతం రూ.5 వేలు, రూ.3 వేలు చెల్లించాలని కోరారు. సంఘం అధ్యక్షురాలు రాధ, కార్యదర్శి కవిత, అనిత, సునంద తదితరులున్నారు.

■ గురుకులం సందర్శన

బేల: బేల బీసీ బాలుర గురుకులాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాలనాధికారి ఆదేశాల మేరకు పోషణ చర్చా కార్యక్రమంలో భాగంగా గురుకులాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపల్ రంగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ ఉపాధ్యాయుడికి సన్మానం

ఉట్నూరు గ్రామీణం: ఉట్నూరు మండలం ఘన్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మండాడి చిన్నబాబు ఈ నెల 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. ఆయనను మాజీ ఎంపీపీ జైవంత్‌రావు సన్మానించారు.

■ గోండి లిపి సృష్టికర్తల కృషి అమూల్యం

నార్నూర్: గోండి భాషకు లిపిని సృష్టించిన కొట్నాక్ జంగు, అర్క జైవంత్‌రావుల కృషి అమూల్యమైనదని ఖానాపూర్ నియోజకవర్గం శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు కొనియాడారు. ఆయన శుక్రవారం గుంజాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన జంగు, జైవంత్‌రావుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

■ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నార్నూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని నార్నూర్ సీహెచ్‌సీ పర్యవేక్షకుడు చరణ్‌దాస్ చవాన్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని బేతాల్‌గూడ, సోనాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. పర్యవేక్షకురాలు గణేష్‌కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్‌ఎం విమల, ఆరోగ్య సహాయకులు కైలాస్, జవహర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు విమల జాదవ్, ఆశా కార్యకర్త మాన్కుబాయి పాల్గొన్నారు.

■ సాయి వైకుంఠ ట్రస్టు సందర్శన

భుక్తాపూర్: జిల్లా కేంద్రంలోని సాయి వైకుంఠ ట్రస్టు కార్యాలయాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద శుక్రవారం సందర్శించారు. మగ్గం, కుట్టు, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ పొందుతున్న, పూర్తి చేసిన మహిళలు, యువతులతో కాసేపు ముచ్చటించారు. బాగా నేర్చుకోవాలని, స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆసరాగా నిలవాలని ఆకాంక్షించారు. ట్రస్టు బాధ్యులు రఘువీర్ యాదవ్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

■ కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఎదులాపురం: కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు శేషారావు, నర్సింగ్, దేవీదాస్, అఖిల్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

■ పంచాయతీలకు రూ.5.05 కోట్లు విడుదల

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాలోని పంచాయతీలకు రూ.5.05 కోట్ల రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. కొంతకాలంగా నిధులు విడుదల కాక పంచాయతీల్లో కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం విడుదలైన నిధులలో పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

■ వన్యప్రాణుల ఛాయాచిత్ర ప్రదర్శన

మావల: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మావల హరితవనంలో వన్యప్రాణుల ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఎఫ్ఆర్ఓ గులాబ్‌సింగ్ ప్రారంభించారు. సెక్షన్ అధికారి ఇబ్రహీం, బీట్ అధికారి జ్యోత్స్న, సిబ్బంది నారాయణ, గంగన్న, రాకేష్, భోజన్న, రాహుల్ పాల్గొన్నారు.

■ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్: ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబీకులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజరు సోలోమన్ అన్నారు. 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డిస్పెన్సరీ ఆసుపత్రిలో కార్మికులు, కుటుంబీకులకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేశారు. డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్ కుమార్, డిపో మేనేజరు కల్పన, ఆర్టీసీ డిస్పెన్సరీ వైద్యుడు యోగేశ్, సంక్షేమ బోర్డు సభ్యురాలు విజయశ్రీ, ఉన్నారు.

■ విద్యాశాఖపై పాలనాధికారి సమీక్ష

పాలనాప్రాంగణం: కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 వరకు సమావేశం కొనసాగింది. విద్యార్థుల హాజరు, అభ్యసనా సామర్థ్యాల మెరుగు, మధ్యాహ్న భోజనం అమలు, పదోతరగతి పరీక్షల సన్నద్ధత, పోషకుల సమావేశం, ఉపాధ్యాయుల సర్దుబాటు అంశాలపై ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలతో చర్చించారు. డీఈవో ప్రణీత, సెక్టోరల్ అధికారులు నారాయణ, సుజాత్‌ఖాన్, ఉదయశ్రీ, జావిద్ తదితరులు పాల్గొన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆకట్టుకున్న కృత్యాలతో మెప్పించిన హెచ్ఎంల పనితీరును ప్రశంసించారు.

■ సజావుగా 'కస్తూర్బా' కౌన్సెలింగ్

పాలనాప్రాంగణం: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఖాళీల భర్తీకి నిర్వహించిన కౌన్సెలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. సెక్టోరల్ అధికారులు ఉదయశ్రీ, జావిద్, సూపరింటెండెంట్ మమత, పీజీహెచ్ఎంలు నర్సయ్య, లచ్చిరాం తదితరులు కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అభ్యర్థులకు నియామక పత్రాలు డీఈవో ప్రణీత అందజేశారు.

■ పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు

పాలనాప్రాంగణం: పర్యాటక రంగంలోనూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ సైన్సు కళాశాల ప్రిన్సిపల్ డా.సంగీత తెలిపారు. పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు కళాశాలలో వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలు మహీన్, అలియా, ఆకుల శిరీష, సదఫ్‌లకు బహుమతులు అందజేశారు.